వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి (ఫైల్)

కొడంగల్‌లో 'పట్నం' జోరు

పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతూ.. ప్రజలతో మమేకమవుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

- గులాబీదండుకు కలిసి వస్తున్న జనం
- చేరికలతో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న బలం
- తమ్ముడు నరేందర్‌రెడ్డి విజయానికి మంత్రి మహేందర్‌రెడ్డి వ్యూహం
- ఇంటింటా బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ముమ్మర ప్రచారం
- మరోసారి గెలిపిస్తే.. కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తానని హామీ

మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో చేరిన వివిధ పార్టీల నాయకులు (ఫైల్)

కొడంగల్, నవంబర్ 25 : గెలుపుదిశగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనోత్సాహంతో ఉవ్వెత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. మరో మారు పట్నం నరేందర్ రెడ్డి పట్టం కట్టే విధంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రతిపక్ష పార్టీల నేతలు బీఆర్ఎస్‌కే పూర్తి మద్దతు తెలుపుతున్నారు. రోజువారీగా బీఆర్ఎస్‌లో చేరికలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుంది. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రజలతో మమేకమవుతూ అలుపెరగని ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే ఎక్కడ ప్రచారం చేసినా ఆ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలుకుతున్నారు. పట్నం నరేందర్‌రెడ్డితోనే కొడంగల్‌కు కొత్త రూపు వచ్చిందని, మరోమారు గెలిపించుకుంటే కొడంగల్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని భావిస్తున్నారు. ప్రత్యేకంగా మహిళలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ నాయకుల ప్రచారంలో మంగళహారతులు పట్టి తిలకం దిద్ది ఆశీర్వదిస్తున్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామ గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించి కేసీఆర్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు.

మంత్రి మహేందర్‌రెడ్డి ముమ్మర ప్రచారం..

మంత్రి మహేందర్‌రెడ్డి తమ్ముడిని గెలిపించుకునేందుకు అలుపెరగని ప్రచారం నిర్వహిస్తూ.. ప్రతిపక్ష పార్టీల నాయకులను బీఆర్ఎస్ వైపు తిప్పుకునేందుకు ప్రత్యేక వ్యూహాన్ని ప్రదర్శిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రచారంతో పాటు అన్ని వర్గాల, పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుస్తున్నారు. మంత్రి నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్, దుద్యాల మండలాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రచారంలో పాల్గొంటున్నారు. మంత్రి పర్యటనతో ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరగింది. ప్రచారంలో తమ్ముడితో కలిసి మంత్రి మహేందర్ రెడ్డి ఓటర్లను నేరుగా కలిసి గ్రామాల సమస్యలను తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తున్నారు. మరో 5 సంవత్సరాల్లో మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు.

ఖాజాఅహ్మద్‌పల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన మహిళలు (ఫైల్)

గ్రామాల్లో బీఆర్ఎస్‌కు చేకూరిన బలం..

మంత్రి, ఎమ్మెల్యే కలిసి ప్రచారం నిర్వహించడం బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో మరింత బలం పెరిగింది. 5 సంవత్సరాలు ఎమ్మెల్యే ప్రజల మధ్యన ఉంటూ ప్రజాసేవకు అంకితం అయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు. గత ఎన్నికల్లో 7వేలకు పైగా మెజారిటీ రాగా, ఈ సారి 30వేల మెజారిటీని దక్కించుకొని మరోమారు ఎమ్మెల్యేగా పట్నం నరేందర్ రెడ్డిని చూడాలని బీఆర్ఎస్ కార్యకర్తలు లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా కేసీఆర్, కేటీఆర్ పర్యటనల్లో ఎమ్మెల్యేకు ప్రమోషన్ ఇస్తామని హామీ ఇవ్వడం మరింత బలం చేకూరింది.

అందుబాటులో ఉండని రేవంత్‌రెడ్డి

గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా రేవంత్‌రెడ్డి గెలిపించుకున్నప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉండలేదనే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుంది. రేవంత్‌రెడ్డి వల్ల కొడంగల్ దశ మారుతుందని భావించి రెండు పర్యాయాలు గెలిపించుకున్నామని, ఆయనతో కొడంగల్‌కు ఎటువంటి మేలు జరగలేదని ప్రజలు పేర్కొంటున్నారు. మొదటి, రెండు సార్లు ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో కొడంగల్‌కు మాత్రమే పరిమితమై ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో రోడ్‌షో ప్రచారం నిర్వహించడం మాత్రమే జరిగేదని తెలిపారు. మూడోసారి హెలీకాప్టర్‌లో వచ్చి రోడ్‌షోకు పరిమితమై వెళ్లిపోవడం మాత్రమే జరిగిందని, ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని మూడో సారి ఓడించిడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సారి కూడా మళ్లీ అదేవిధంగా ప్రవర్తిస్తూ.. ప్రజలను విస్మరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో కూడా ప్రజల మధ్యకు రాకపోవడం పట్ల ఓటర్లు విసుక్కొంటున్నారు. అధికారం కోసం మాత్రమే రేవంత్‌రెడ్డి పరితపిస్తున్నాడని, ప్రజా సంక్షేమం ఆయనకు పట్టలేదని పేర్కొంటున్నారు. ప్రజల్లోకి రేవంత్‌రెడ్డి కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారం చేయడాన్ని ఓటర్లు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై దౌర్జన్యం చేసినట్లు ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత 5 సంవత్సరాల నుంచి బీఆర్ఎస్ పార్టీ పాలన, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో కొడంగల్ ఎంతో అభివృద్ధి జరిగిందని ప్రజలు పేర్కొంటున్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

అంగడి చిట్టంపల్లి చెక్ పోస్ట్ వద్ద రూ.23లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

పూడూరు, నవంబర్ 25 : వికారాబాద్ జిల్లా హైదరాబాద్-బీజాపూర్ హైవే రోడ్డు అంగడి చిట్టంపల్లి స్టేజీ వద్ద సీఐ బాలస్వామి, చన్గోముల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై గిరి వాహనాల తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి పరిగి నియోజకవర్గం మోత్కురు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రూ.23.50లక్షల నగదు తమ వాహనంలో తీసుకువచ్చారు. ఆ డబ్బులకు సంబంధించిన వివరాలను అడుగగా భూమి విక్రయించిన డబ్బులుగా తెలిపినట్లు చెప్పారు. పట్టుబడిన డబ్బులకు సరైన పత్రాలను చూయించకపోవడంతో ఆ నగదును సీజ్ చేసినట్లు ఎస్సై గిరి తెలిపారు.

నగదును చూపుతున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ నేతల మృతి



బీఆర్ఎస్ నేత రమేష్ పాడె మోస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్‌రెడ్డి

శోకసంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు

అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్/మొయినాబాద్, నవంబర్ 25 : తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం దామర్‌చేడ్ గ్రామానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు శనివారం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఘటన తాండూరులో జరిగింది. హైదరాబాద్ శివారులోని అజీజ్‌నగర్ వద్ద తుఫాన్ వాహనం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు లక్ష్మయ్య(విశ్రాత ఉద్యోగి), రమేష్‌లు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన మరో 6మందిని హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన తాండూరు బీఆర్ఎస్‌లో తీవ్ర విషాదం రేపింది. రోడ్డు ప్రమాదంపై తాండూరు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బలమైన పార్టీ నేతలను కోల్పోయామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటించారు. గాయపడిన బీఆర్ఎస్ నాయకులకు హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఇద్దరు ఒకేసారి చనిపోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. రమేష్ అంత్యక్రియలు శనివారం రాత్రి జరుగగా, ఈ అంత్యక్రియల్లో రోహిత్‌రెడ్డి పాల్గొని రమేశ్ పాడె మోశారు. లక్ష్యయ్య అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రమేశ్ (ఫైల్)

లక్ష్యయ్య (ఫైల్)

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

మహ్మద్ గౌసుద్దీన్ (ఫైల్)

మొయినాబాద్, నవంబర్ 25 : గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యారు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్ (46) అతడి స్నేహితుడు అబ్దుల్ రహీంతో కలిసి బైక్‌పై శుక్రవారం అర్ధరాత్రి చేవెళ్ల నుంచి మొయినాబాద్‌కు వస్తున్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టింది. దీంతో మహ్మద్ గౌసుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందగా, అబ్దుల్ రహీంకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన అబ్దుల్ రహీంను చికిత్స కోసం దవాఖానకు తరలించారు. మృతుడి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.